క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లోని దుర్గాభవానీమాత జాతరలో భాగంగా వచ్చే భక్తుల కోసం బీఆర్‌ఎస్ నాయకులు అభిషేక్‌షెట్కార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇట్టి కేంద్రాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీబాయి, నాయకులు రవీందర్‌నాయక్, కౌన్సిలర్ కవితావిఠల్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నగేష్, నాయకులు సిద్దయ్యస్వామి, బాసిత్, పండరి తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 13మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వాహనదారులను కోర్టులో బుధవారం హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



రోదిస్తున్న బాధితురాలు

నారాయణఖేడ్: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. ఈ ఘటన ఖేడ్ మండలం.. వెంకటాపూర్ పరిధిలోని కిషన్‌నాయక్ తండాలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మహిళా రైతు కేలోత్ మోతీబాయికి చెందిన పాడిగేదె బుధవారం తండా శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేతమేస్తూ ఎర్తింగ్ వైర్‌ను తాకింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాత పడింది. గేదె విలువ రూ.70వేలు ఉంటుందని, బాధితురాలిని ప్రభుత్వం ఆదుకోవాలని కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షుడు మల్‌గొండ, నాయకులు సంధ్యానాయక్, బక్షిరాం, గణపతి, పాండు, సురేష్ కోరారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

సంగారెడ్డి టౌన్: పెండింగ్‌లో ఉన్న ధరణి భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 17వేలకు పైగా ధరణి భూ సమస్యలు పెండింగ్‌లో ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉపాధిహామీ పనులకు సంబంధించి ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నర్సింహులు, నాయకులు రాజయ్య, నర్సింహారెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



ఈటల రాజేందర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మాజీ మంత్రి, బీజేపీ నేత ఈటల రాజేందర్ సమక్షంలో బుధవారం బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఈటల రాజేందర్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ బీజేపీ ఎంపీ అభ్యర్థిని గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌రావు, శివశంకర్, బాలయ్య, సత్యనారాయణ, శ్రీశైలం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కారు మోటార్‌సైకిల్‌ను ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన తెల్లాపూర్ పరిధిలోని రేడియల్ రోడ్డుపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌కు చెందిన జంగయ్య(40) మోటార్‌సైకిల్ పై తెల్లాపూర్ వచ్చాడు. బుధవారం సాయంత్రం తెల్లాపూర్‌లోని వెన్స్ దుకాణం వద్ద నుంచి బైక్ పై రేడియల్ రోడ్డు పైకి వచ్చాడు. ఆ సమయంలో జంగయ్య ప్రయాణిస్తున్న బైక్‌ను ఓ కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలైన జంగయ్యను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పేదోడి ఫ్రిజ్‌లకు భలే గిరాకీ

జోరుగా మట్టి కుండల అమ్మకాలు

- రూ.50 నుంచి 500 వరకు అందుబాటులో ధరలు
- కొనుగోలుపై ఆసక్తి చూపుతున్న ప్రజలు

నాగరికతతో పాటు ప్రజల జీవనశైలిలో కూడా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పూర్వీకులు మట్టి పాత్రలను వాడేవారు. తాగునీటి కోసం మట్టికుండలను ఉపయోగించుకునేవారు. కాలంతో పాటు మట్టి కుండల స్థానంలో ఇత్తడి, స్టీల్, అల్యూమీనియం పాత్రలు, కుండలు వచ్చాయి. కానీ.. వీటితో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, మట్టి పాత్రలే మంచివన్న ప్రచారం కొనసాగుతోంది. మట్టి పాత్రల వాడకంపై వైద్యులు, నిపుణులు సూచనలు చేస్తున్నారు. సోషల్ మీడియాల్లో కూడా విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రజలు మట్టి పాత్రల కొనుగోలు వాడకంపై ఆసక్తి చూపుతున్నారు. మట్టి కుండల్లో నీరు శుభ్రంగా, చల్లగా ఉంటుందని వీటిని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

– జహీరాబాద్ టౌన్



భవానీ మందిరం వద్ద విక్రయిస్తున్న మట్టి కుండలు

పేదోడి ఫ్రిజ్‌గా మట్టి కుండలకు మంచి పేరుంది. వీటి ద్వారా కుమ్మరి వృత్తి వారికి ఉపాధి లభిస్తుంది. పట్టణంలోని భవానీ మందిరం, గెస్ట్‌హౌస్ సమీపంలో మట్టి పాత్రల విక్రయాలకు అడ్డగా మారింది. చిన్నచిన్న సైజు నుంచి పెద్దపెద్ద మట్టి కుండలు అందుబాటులో ఉన్నాయి. ఈ మట్టి కుండల్లోని నీరు తాగితే ఆరోగ్యానికి మేలన్న నమ్మకంతో చాలామంది వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఎండలు మండుతుండటంతో వీటి డిమాండ్ మరింత పెరిగింది. రూ.50 నుంచి 500 వరకు వీటి ధరలు అందుబాటులో ఉన్నాయి.

గిరాకీ పెరిగింది

గతం కన్నా ప్రస్తుతం మట్టి కుండలు, వంట పాత్రలను కొనడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. మట్టి కుండలను ఎప్పటి నుంచో వినియోగిస్తుండగా ఇప్పుడిప్పుడే మట్టితో తయారు చేసిన గృహోపకరణాల వాడకంపై కూడా ఆసక్తి చూపుతున్నారు. మట్టి కుండలు మాత్రమే కొనేవారు వంట పాత్రలు, వాటర్ బాటిల్స్, దోశ ప్యాన్ తదితర వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. మట్టి పాత్రలతో తయారుచేసిన వంటలు రుచిగా ఉంటాయి. వాటి గుణం కోల్పోదు. ధరలు కూడా తక్కువగా ఉన్నందునా వీటిని ప్రజలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

– సురేష్, మట్టి ప్రాతల వ్యాపారి



మట్టితో తయారుచేసిన వంట పాత్రలు, వాటర్ బాటిల్స్

ఆరోగ్య సమస్యలు దూరం

మట్టితో తయారుచేసిన వంట పాత్రల ద్వారా ఆరోగ్య సమస్యలు రావని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో చాలామంది వీటిని వినియోగించేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొనుగోలుదారుల డిమాండ్ మేరకు కుమ్మరి వృత్తుల వారు వంట పాత్రలు, వాటర్‌బాటిల్స్, గృహోపకరణాలను తయారుచేసి విక్రయిస్తున్నారు.

ఉచిత కరెంట్ కోసం అవస్థలు

- మున్సిపల్ కార్యాలయం చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు
- పట్టించుకోని అధికారులు

జహీరాబాద్ టౌన్: ఉచిత కరెంట్ కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ లేక జీరో బిల్లులు రావడంలేదు. తిరిగి దరఖాస్తు చేసుకున్నా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేయడం లేదని, జీరో బిల్లు కోసం మున్సిపల్, ట్రాన్స్‌కో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని ప్రజలు వాపోతున్నారు. ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం గృహ జ్యోతి పథకం ద్వారా జీరో విద్యుత్ బిల్లు జారీ ప్రక్రియ ప్రారంభించగా సిబ్బంది ఇంటింటికి వెళ్లి బిల్లింగ్ తీశారు. కానీ.. వివిధ కారణాల వల్ల అర్హులైన వారికి జీరో బిల్లు రాలేదు. గృహజ్యోతి పథకానికి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా అర్హులైన వారికి 200 యూనిట్ల లోపు రీడింగ్ ఉంటే ఉచిత విద్యుత్ అమలు చేయాలనేది ఈ పథకం ఉద్దేశం. అర్హులైన వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయగా చాలామంది వివరాలు అందులో కనిపించలేదు. కొంతమందికి దరఖాస్తు చేయనట్లు చూపిస్తోంది. ఆన్‌లైన్‌లో తమ పేర్లు కనిపించని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న చాలామందికి జీరో బిల్లులు రావడంలేదని ఆరోపణలు వస్తున్నాయి.



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, లబ్ధిదారులు

అధికారుల తప్పిదమే కారణం

అధికారుల తప్పిదంతోనే అర్హులకు జీరో బిల్లులు రావడంలేదని సీపీఐ జహీరాబాద్ డివిజన్ కార్యదర్శి నర్సింహులు మండిపడ్డారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం లబ్ధిదారులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డేటా ఎంట్రీ సరిగ్గా చేయని కారణంగా ఉచిత కరెంట్ అమలు కావడం లేదన్నారు. జీరో బిల్లురాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అధికారులను గట్టిగా ప్రశ్నిస్తే ఎన్నికల కోడ్ ఉందని దాటవేస్తున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అర్హులకు జీరో బిల్లులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

శ్లోకా స్కూల్ యజమాన్యంపై కేసు నమోదు చేయాలి

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో పర్మిషన్ లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న శ్లోకా దా స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బిల్డింగ్ పూర్తికాకుండానే పర్మిషన్ లేకుండానే శ్లోకా ది స్కూల్ అడ్మిషన్లు తీసుకుంటున్నారన్నారు. పర్మిషన్ లేదని డీఈఓ ఇటీవల పేపర్ ప్రకటన జారీ చేసినప్పటికీ స్కూల్ యాజమాన్యం అడ్మిషన్లు తీసుకుంటోందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకొని అడ్మిషన్లు నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శ్రీకాంత్, కార్తీక్, ప్రవీణ్‌కుమార్, అఖిల్, మహేష్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు



కోదండరామశర్మను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణపాటిల్

సదాశివపేట(సంగారెడ్డి): క్రోధినామ ఉగాది వేడుకలు పట్టణంలోని శ్రీరామకళా మందిరంలో శ్రీనివాస్‌రాందాసి అధ్యక్షతన పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ రుక్మబట్ల కోదండరామశర్మ సిద్దిపేట గారు పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణపాటిల్, వైస్‌చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు విద్యాసాగర్ రెడ్డి, రాజేశ్వరి, పిల్లోడి విశ్వనాథం, కోఆప్షన్ మెంబర్ కోడూరి అంజయ్య, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యజ్ఞశ్రీ మనోహర్‌శర్మ, మండల అధ్యక్షులు కరణం నరసింహారావు, సభ్యులు సత్యనారాయణ, బిన్, శంకర్‌రావు, మహేష్‌స్వామి పాల్గొన్నారు.

రిజర్వేషన్ల రక్షణకు పోరాడుదాం

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్

సదాశివపేట(సంగారెడ్డి): ప్రతిఒక్కరూ రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల రక్షణ కోసం పోరాడాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సదాశివ పట్టణంలో సామాజిక చైతన్య బైక్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే విద్యకోసం మహిళ జాతి విముక్తి కోసం పోరాడిన మహనీయుడన్నారు. డాక్టర్ అంబేడ్కర్ కులవివక్షత, అంటరానితనంపై అసమానతలపై పోరాడిన మహనీయులని కొనియాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, సామాజిక ఉద్యమ నాయకుడు చుక్కల నాగరాజు, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశం, మండల కార్యదర్శి మహేష్, అవాజ్ సంఘం నాయకుడు ఖయ్యూం, కేవీపీఎస్ నాయకులు బాలరాజ్, రాజేష్, అశ్వక్, ప్రదీప్, నాగరాజు, మోహన్, పవన్, శ్రీకాంత్, రాజు, అనిల్, అనంద్ పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు

ప్రతిఒక్కరితోనూ మమేకమవుతా

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు

పటాన్‌చెరు టౌన్: మెదక్ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు ప్రతిఒక్కరితోనూ మమేకమవుతూ వెళ్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో పార్లమెంటు పరిధిలోని ఆయా నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు, అభిమానులు నీలం మధును మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. నీలం మధును కలిసినవారిలో నర్సాపూర్ మండలంలోని తుగ్గరాంపేట తండాకు చెందిన మాణిక్యరావు, వర్గల్‌కు చెందిన చక్రవర్తి టీం, వెల్దూర్ సదాశివపేటకు చెందిన హిందూ మద్దూర్ సభ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం, లక్ష్మణ్, రమేష్, రాములు, సిద్దిపేటకు చెందిన పలువురు చర్చిల ఫాదర్లు, అమీన్‌పూర్, దాదిగూడెం, జిన్నారం, నాసిపూర్, నందిగామ, కంది, సంగారెడ్డి పట్టణానికి చెందిన ముఖ్య నేతలు, నాయకులు ఉన్నారు.



నీలం మధును సన్మానిస్తున్న నాయకులు

మాజీ ఎమ్మెల్యేను కలిసిన నీలం మధు

పటాన్‌చెరు టౌన్: సమాజ్‌వాది పార్టీ జాతీయ కార్యదర్శి, ఉత్తరప్రదేశ్ సయ్యద్ రాజా అసెంబ్లీ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మనోజ్‌కుమార్‌సింగ్‌ను పటాన్‌చెరు శ్రీరామ్ నగర్ కాలనీలోని ఆయన నివాసంలో మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ సింగ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు ఉన్నారు.

దౌల్తాబాద్‌లో పోలీసుల కవాతు

హత్నూర(సంగారెడ్డి): రాబోయే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేవిధంగా ప్రజలు సహకరించాలని కోరుతూ హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో పోలీసు పారామిలిటరీ అధికారులు బుధవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా జిన్నారం సీఐ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. కవాతులో ఏఆర్‌డీ ఎస్పీ నరేందర్, ఎస్‌ఐ సుభాష్, ఎస్‌ఐలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వ్యర్థాల పారబోతపై విచారణ

సాక్షి ఎఫెక్ట్

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం, గడ్డపోతారం, ఖాజీపల్లి, బొంతపల్లి పారిశ్రామికవాడల్లో నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమల యాజమాన్యాలు వ్యర్థాలను పారబోస్తూ కాల్చివేస్తున్నారు. దీంతో ఈ నెల 9న సాక్షిలో 'యథేచ్ఛగా వ్యర్థాల పారబోత' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్ వెంటనే నివేదికను అందించాలని పీసీబీ అధికారులను ఆదేశించగా పీసీబీ ఈఈ కుమార్‌పాటక్, ఏఈఈ అజయ్ పారిశ్రామికవాడల్లో బుధవారం పర్యటించారు. వ్యర్థాలు పారబోయటంతో పాటు కాల్చివేస్తున్న విషయమై ఆరా తీశారు. వ్యర్థాలను బహిరంగంగా పారవేసినా, వాటిని కాలుస్తున్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదికను అందజేస్తామని కుమార్‌పాటక్ తెలిపారు.

లీకేజీతో తాగునీటి వృథా

ఝరాసంగం(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో లీకేజీలతో తాగునీరు వృథాగా అవుతోంది. అయినా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. ఓవైపు ఆయా గ్రామాల్లో తాగునీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ఈ విధంగా నీరు వృథాగా పోతుండటంతో అధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ఝరాసంగం ప్రధాన రహదారిపై వృథా అవుతున్న తాగునీరు

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

కంది(సంగారెడ్డి): సెల్ టవర్ ఎక్కి వ్యక్తి హల్ చేసిన ఘటన మండల కేంద్రమైన కందిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని కాశీపూర్ గ్రామానికి చెందిన లక్ష్మయ్య భార్యా, పిల్లలు లేకపోవడంతో ఒంటరిగానే ఉంటున్నాడు. ఇతడికి ప్రతీ నెలా 5 కిలోల రేషన్ వస్తుంది. ఈ క్రమంలో తాను ఒక్కడినే అని కాబట్టి రేషన్ 20 కిలోలు ఇవ్వాలని సెల్ టవర్ ఎక్కాడు. అలాగే ఫింఛన్ కూడా ఇవ్వాలని , అధికారులు వచ్చే వరకు దిగేది లేదని మొండికేశాడు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై వినయ్ కుమార్, సిఐ అశోక్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. తహసీల్దార్ విజయలక్ష్మికి సమాచారం అందించారు. అలాగే ఫైర్ ఇంజన్‌ను కూడా తెప్పించారు. సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో లక్ష్మయ్య టవర్ దిగాడు. దీంతో ఉత్కంఠకు తెరపడింది.



చలివేంద్రం ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లో మందాడ నరేందర్‌రెడ్డి తండ్రి రంగారెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో తెల్లాపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ తూర్పు శ్రీనివాస్, నాయకులు కృష్ణ, రాజేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వాజిద్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

సంక్షిప్త వార్తలు

◆ **రెమ్యూనరేషన్ చెల్లించాలి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఈ ఏడాది పదో తరగతి మూల్యాంకన రెమ్యూనరేషన్, గత ఏడాది పెండింగ్‌లో ఉన్న డబ్బులను చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బెల్ టౌన్‌షిప్‌లోని జ్యోతి విద్యాలయంలోని 10వ తరగతి మూల్యాంకన కేంద్రంలోని డిప్యూటీ క్యాంపు అధికారికి బుధవారం వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిలక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, నాయకులు చక్రవర్తి, శ్రీశైలం, ప్రభాకర్, రాజు పాల్గొన్నారు.

◆ **ఘనంగా శ్రీవారి వార్షికోత్సవం**

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని దామర్‌గిద్దా శివారులోని పద్మావతి సహిత లక్ష్మీవేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి భజన, జాగరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

◆ **ఇఫ్తార్ విందు ఏర్పాటు**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని అత్నూర్ గ్రామంలో బుధవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామానికి చెందిన కలీం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందులో ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

◆ **బీజేవైఎం కన్వీనర్‌గా నరేష్**

జహీరాబాద్ టౌన్: భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) జహీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్‌గా పట్టణానికి చెందిన నరేష్‌పాటిల్‌ను నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తనకు అవకాశం కల్పించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌కు నరేష్‌పాటిల్ కృతజ్ఞతలు తెలిపారు.

◆ **తాగునీటి సమస్య లేకుండా చూడాలి**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీ అధికారి నారాయణ బుధవారం ఒక ప్రకటనలో అధికారులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజు గ్రామాల్లో పర్యటించి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

◆ **ఈద్గా పనుల పరిశీలన**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రంజాన్ పండుగ సందర్భంగా రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఈద్గాను పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్ప పనులను పర్యవేక్షించారు. నాయకులు హబీబ్, నయీమ్, అక్బర్, అఖిల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

◆ **రంజాన్ తోఫా పంపిణీ**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ కల్వగడ్డ రాజ్‌కుమార్ ముస్లింలకు బుధవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. నాయకులు బాలరాజ్, దయాకర్, మన్నే గోపి పాల్గొన్నారు.

◆ **ఈతకు వెళ్లొద్దు**



ఝరాసంగం(జహీరాబాద్): వేసవి నేపథ్యంలో చెరువులు, నీటి కుంటలు, బావుల్లో ఈత కొట్టేందుకు వెళ్లొద్దని ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని చెరువులు, నీటి కుంటల వద్ద బుధవారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరదా కోసం ఈతకు వెళ్లి ప్రాణాలను కొని తెచ్చుకోవద్దని సూచించారు. పిల్లల పట్ల వారి తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలన్నారు.

◆ **ఈద్గా సందర్శన**

నారాయణఖేడ్: పట్టణ శివారులోని ఈద్గాను బుధవారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, కౌన్సిలర్ మాజీద్, మైనార్టీ నాయకులైన తాహెర్ అలీ, ముంతాజ్ తదితరులతో కలిసి సందర్శించారు. శానిటరీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **రేపు బండ్ల ఊరేగింపు**

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని బాన్సువాడ శివారులోని బారడి పోచమ్మ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పోచమ్మతల్లి అభిషేకం, సాయంత్రం ఎడ్లబండ్లు, బోనాలతో ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

శనివారం కుస్తీపోటీలు

బారడి పోచమ్మ ఆలయం సమీపంలో శనివారం మధ్యాహ్నం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి మల్లయోధులు పాల్గొనున్నట్లు తెలిపారు.

◆ **సీతారామచంద్రుల విగ్రహాల ఊరేగింపు**

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని రాసోల్ గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన లక్ష్మణ సహిత సీతారామచంద్రుల ఆలయంలో ప్రతిష్ఠంచనున్న విగ్రహాలను బుధవారం ఊరేగింపు నిర్వహించారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ నుంచి వచ్చిన విగ్రహాలను కంగ్టి రామాలయంలో ఉంచారు. అక్కడి నుంచి రాసోల్ గ్రామానికి ఊరేగింపుగా తీసుకొని వచ్చారు.

నేటి నుంచి సప్తాహం

విగ్రహాల ప్రాణప్రతిష్ఠాపనలో భాగంగా గురువారం నుంచి వారం రోజుల పాటు అఖండ హరినామ సప్తాహం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 15న ప్రాణప్రతిష్ఠ ఉంటుందన్నారు.

◆ **బీరప్ప మహోత్సవాలు ప్రారంభం**

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని మేడికుందా గ్రామంలో బీరప్ప ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా అక్కమహంకాళి, కామరాతి సమేత బీరప్ప సహిత, నందీశ్వర విగ్రహాలను గ్రామంలోని పురవీధుల గుండా ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

◆ **భద్రాద్రి తలంబ్రాలకు ఆర్డర్ చేసుకోండి**

కంగ్టి(నారాయణఖేడ్): ఆర్టీసీ సేవల్లో భాగంగా శ్రీరామ నవమి సందర్భంగా భద్రాద్రిలో నిర్వహించే సీతారామచంద్రుల కల్యాణం ముత్యాల తలంబ్రాలు ఇంటివరకు అందజేస్తామని డిపో మేనేజర్ మల్లేశం తెలిపారు. ఈ మేరకు కంగ్టి మండలంలోని గాజుల్‌పాడ్ గ్రామంలో బుధవారం పలువురు భక్తులకు ఆర్టీసీ పీఆర్‌ఓ పాండు ఆధ్వర్యంలో ఆర్డర్లు బుక్ చేశారు. రూ.151లు చెల్లించి ముత్యాల తలంబ్రాలు బుక్ చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న భక్తులు ఆర్డర్లు బుక్ చేసుకోవడానికి ఆర్టీసీ సిబ్బందికి 94410 71134, 73828 30800 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది నెహ్రూ, మాజీ సర్పంచ్ మస్తాన్, మాధవరావు, దీపక్ పాల్గొన్నారు.